# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

గురువారం 26 జూన్ 2025 పేజీలు 8


## జూబ్లీహిల్స్ లో గెలిచి తీరుతాం

### పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్




హైదరాబాద్ పెన్ పవర్:జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేయడమే కాదు, తప్పకుండా విజయం సాధిస్తుందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఇవాళ గాంధీభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. జూబ్లీ హిల్స్ ఎన్నికలపై కీలక నిర్ణయాలు తీసుకోవడంతోపా టు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో విజయం సాధించేం దుకు అనుసరించాల్సిన వ్యూహాలపై

- మిగతా 2లో...

## ఫీజులు పెంచుకోవడానికి


# తప్పుడు లెక్కలా?

- అలాంటి ఇంజినీరింగ్ కాలేజీలపై కేసులు పెట్టండి
- విద్యా వ్యాపారాన్ని నియంత్రించాలి
- పాత ఫీజులతోనే కౌన్సెలింగ్ ప్రారంభించాలి
- విద్యాశాఖ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



హైదరాబాద్ పెన్ పవర్: ఫీజులు పెంచుకునేందుకు.. తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ (టీఏఎఫ్‌ఆర్‌సీ)కి తప్పుడు పత్రాలు అందజేసిన ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలపై కేసులు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం విద్యాశాఖపై సీఎం మూడు గంటలకుపైగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ ఫీజులపై చర్చించినట్లు సమాచారం. కొన్ని కళాశాలలు అధ్యాపకులకు ఎక్కువ మొత్తంలో వేతనాలు ఇచ్చినట్లు, నిర్వహణ పనులకు అధికంగా ఖర్చు చేసినట్లు టీఏఎఫ్‌ఆర్‌సీకి తప్పుడు లెక్కలు సమర్పించాయన్న ఆరోపణలు వచ్చాయి. వీటి ఆధారంగా ఫీజుల పెంపును టీఏఎఫ్‌ఆర్‌సీ కమిటీ ప్రాథమికంగా నిర్ధారించి.. అందుకు యాజమాన్యాలు సమ్మతించినట్లు వారి సంతకాలు కూడా తీసుకుంది. ఈ విషయమై ముఖ్యమంత్రి సమీక్షలో అధికారులకు స్పష్టత ఇచ్చారు.

-2 లో



## తెలంగాణలో మూడ్రోజులు వర్షాలు

### ఐదు జిల్లాలకు వాతావరణ కేంద్రం ఎల్లో హెచ్చరిక

- వాయువ్య బంగాళాఖాతంలో 24 గంటల్లో అల్పపీడనం
- తెలంగాణలో మూడు రోజులు వర్ష సూచన
- ఐదు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వానలు
- గంటకు 30-40 కి.మీ వేగంతో ఈదురుగాలులు
- సంబంధిత జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ ముఖ్య హెచ్చరిక జారీ చేసింది. రానున్న 24 గంటల్లో వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

-2 లో

### ఇసుక అక్రమ రవాణాపై

## ఉక్కుపాదం మోపుతున్నాం

హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్ర మైనింగ్ శాఖ మంత్రిగా ఛార్జ్ తీసుకున్నప్పటి నుంచి అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నానని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. అక్రమ ఇసుక దందాలు చేసే వాళ్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశానని తెలిపారు. ప్రతీ ఒక్కరూ మీసేవలో ఇసుక బుక్ చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర కార్మికశాఖ, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి బుధవారం (జూన్ 25) చెన్నూర్ నియోజకవర్గంలో పర్యటించారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.

-2 లో





## స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం కాంగ్రెస్‌కు లేదు

- దేశ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజు: డీకే అరుణ
- రెండు ఎకరాల రైతులకు కూడా రైతు భరోసా అందడం లేదని విమర్శ
- ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణకు డిమాండ్



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీపై బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే ధైర్యం కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని ఆమె ఎద్దేవా చేశారు. రైతు సంక్షేమంపై గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, రెండు ఎకరాల భూమి ఉన్న చిన్న రైతులకు కూడా రైతు భరోసా అందించడంలో విఫలమైందని విమర్శించారు. ఇలాంటి

-2 లో

# ఫీజులు పెంచుకోవడానికి తప్పుడు లెక్కలా?

- మొదటి పేజీ తరువాయి

గత ముఖ్యమంత్రి కేసీఆర్.. టాస్క్‌ఫోర్స్ అంటూ ఇంజినీరింగ్ కళాశాలలను తనిఖీ చేయించినా, కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేకపోయారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించినట్లు సమాచారం. కొందరు విద్యను వ్యాపారంగా మార్చుకున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. "గత సర్కారు తీరులా కాకుండా మనం కొండను తవ్వాలి.. కళాశాలల దందాను నియంత్రించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గరాదు. విద్యారంగంలో అవినీతి మరక కనపడవద్దు. రాష్ట్రంలో సాంకేతిక విద్య దేశానికి ఆదర్శంగా మారాలి. అందుకు అవసరమైన ప్రక్షాళన చర్యలు చేపట్టాలి" అని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు సమాచారం.

**న్యాయపరమైన సమస్యలు రాకుండా కౌన్సెలింగ్**

ఈసారి పాత ఫీజులతోనే ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఇప్పటికే ఆదేశించిన సీఎం.. తాజాగా మరోసారి అదే విషయాన్ని చెప్పినట్లు తెలిసింది. ఎవరైనా కోర్టును ఆశ్రయించే అవకాశం ఉన్నందున.. న్యాయపరమైన సలహాలు తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్ష ముగిసిన అనంతరం సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన.. అడ్వొకేట్ జనరల్‌ను, ఇతర న్యాయ నిపుణులను సంప్రదించారు. కౌన్సెలింగ్ షెడ్యూల్ జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిన క్రమంలో.. ఉన్నత విద్యామండలి, సాంకేతిక విద్యాశాఖ అధికారులు చర్చించి షెడ్యూల్‌ను విడుదల చేయనున్నారు. ప్రవేశాల కమిటీ ఛైర్మన్ అయిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డిని సీఎం సమీక్ష సమావేశానికి ఆహ్వానించకపోవడం చర్చనీయాంశమైంది.

**ఐఏఎస్‌లూ.. బడులను సందర్శించాలి: సీఎం**

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు వారంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని లక్ష్యం విధించారు. ఐఏఎస్ అధికారులందరూ బడులతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను విధిగా తనిఖీ చేయాలన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో 48 వేల మంది చేరారని అధికారులు చెప్పగా.. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన తరగతి గదులు నిర్మించాలని సీఎం ఆదేశించారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలూ పెరుగుతున్నందున వారికి వసతులు కల్పించాలని సూచించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా ఇంటర్మీడియట్/తత్సమాన కోర్సుల్లో చేరేలా చూడాలని నిర్దేశించారు. ఇంటర్మీడియట్ అనంతరం నైపుణ్య కోర్సుల్లో శిక్షణ పొందితే వారి జీవనోపాధికి ఢోకా ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలకు కట్టెల పొయ్యి బాధల నుంచి విముక్తి కల్పించాలని.. సోలార్ కిచెన్ల ఏర్పాటుపై దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్, విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.హరిత, జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ ఆచార్య కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# తెలంగాణలో మూడ్రోజులు వర్షాలు

- మొదటి పేజీ తరువాయి

వాతావరణ శాఖ అందించిన సమాచారం ప్రకారం, ఈ అల్పపీడనం కారణంగా తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే సూచనలున్నాయి. ముఖ్యంగా, ఈ రోజు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు పడొచ్చని తెలిపింది. కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీస్తాయని హెచ్చరించింది.భారీ వర్ష సూచన నేపథ్యంలో పైన పేర్కొన్న ఐదు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వివరించింది.

# స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం కాంగ్రెస్‌కు లేదు

- మొదటి పేజీ తరువాయి

పరిస్థితుల్లో రైతు భరోసా పేరుతో సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని, ఇది కాంగ్రెస్ నేతలకే తెలియాలని ఆమె అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కోవడానికి కాంగ్రెస్ పార్టీ భయపడుతోందని, అందుకే ఎన్నికల నిర్వహణలో జాప్యం చేస్తోందని ఆరోపించారు.

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీజేపీ నాయకులందరూ బాధితులేనని డీకే అరుణ తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆమె సూటిగా ప్రశ్నించారు. అదేవిధంగా, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై కూడా సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ రెండు కీలకమైన అంశాలపై సీబీఐ విచారణ కోరడంలో ప్రభుత్వం ఎందుకు వెనకాడుతోందో చెప్పాలని ఆమె నిలదీశారు.జూన్ 25వ తేదీ భారతదేశ చరిత్రలోనే ఒక చీకటి రోజని ఎంపీ డీకే అరుణ అభివర్ణించారు. ఎమర్జెన్సీ పేరుతో కాంగ్రెస్ పార్టీ దేశంలో చేసిన అరాచకాలు, ప్రజలపై సాగించిన దౌర్జన్యాల గురించి నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. నాడు పేదలపై అకృత్యాలకు పాల్పడిన కాంగ్రెస్ పార్టీ, నేడు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సామాజిక న్యాయం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తన సొంత అజెండాను దేశంపై రుద్దేందుకే గతంలో రాజ్యాంగ సవరణలు చేసిందని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు తూట్లు పొడిచిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు రాజ్యాంగం గురించి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రపంచవ్యాప్తంగా లభిస్తున్న ఆదరణ, కీర్తి ప్రతిష్టలను చూసి రాహుల్ గాంధీ ఓర్వలేకపోతున్నారని డీకే అరుణ ధ్వజమెత్తారు. "ఆపరేషన్ సిందూర్" ద్వారా భారతదేశ శక్తి సామర్థ్యాలను పాకిస్థాన్‌కు రుచి చూపించామని ఆమె గుర్తుచేశారు. ప్రధానమంత్రి మోదీని విమర్శించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ముందుగా ఎమర్జెన్సీ కాలం నాటి కాంగ్రెస్ దురాగతాల గురించి మాట్లాడాలని ఆమె హితవు పలికారు.

## ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నాం

- మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెన్నూర్ నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు.

మార్నింగ్ వాక్ కార్యక్రమంలో ప్రజా సమస్యలు తెలుసుకొని.. వాటన్నిటినీ పూర్తి చేస్తున్నానన్నారు. చెన్నూర్ మున్సిపాలిటీలో ప్రతీ వార్డుకు సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. రూ.30 కోట్ల నిధులతో అమృత్ పథకం ద్వారా మంచి నీరు పంపిణీ చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేశామని, త్వరలోనే లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు అన్ని పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత బస్సులు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతు భరోసా వంటి స్కీములన్ని ఇంప్లిమెంట్ చేస్తున్నామన్నారు. 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయల నిధులు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు.

## జూబ్లీహిల్స్ లో గెలిచి తీరుతాం

### పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్

- మొదటి పేజీ తరువాయి

సమావేశా లు నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర చరిత్రలో ఇది గోల్డెన్ పీరియడ్ అన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఉంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. దేశ చరిత్రలో అదో హేయమైన చర్య అని మండిపడ్డారు. ఈ కేసులో ఎంతటి వారు ఉన్నా.. శిక్ష తప్పదని అన్నారు. కాళేశ్వరంతో పాటు పలు కుంభకోణాలను వెలు గుతీసి ఎవరినీ వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లఅమలుపై కాంగ్రెస్ పార్టీ చర్చించి నిర్ణయం ఓ నిర్ణయం తీసుకుంటుందన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ నేతలు నోరు మెదపడం లేదని కామెంట్ చేశారు. మూడు ముక్కలాటతో బీఆర్ఎ స్ పార్టీ ఖేల్ ఖతం అయిందన్నారు.

కవిత చెప్పిన ట్టు బీఆర్ఎస్లో దెయ్యాలుంటే.. కాంగ్రెస్లో దేవత లున్నారని కామెంట్ చేశారు. మహిళల అభివృద్ధి గురించి కవిత మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. బీజేపీ రాజ్యసభ సభ్యులు కృష్ణయ్య. కవితకు మద్దతు మాట్లాడటం విచారకరమని పేర్కొన్నారు. బనకచర్లతో రాష్ట్రానికి అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని.. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు కట్టుకో మని జీవోలు ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీ కాదా అని మండిపడ్డారు. కృష్ణా జలాల విషయంలో హరీశ్ రావు సంతకం ఎందుకు పెట్టిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అభూత కల్పనతో బీఆ ర్ఎస్ పార్టీ సోషల్ మీడియా వ్యవస్థను నడుపు తున్నారని.. వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

# బీఆర్ఎస్ లో ట్యాపింగ్ టెన్షన్!! పద్మాదేవేందర్ రెడ్డి, తాటికొండ రాజయ్యకు సిట్ నోటీసులు

- ఇంకా ఎవరి ఫోన్లు ట్యాప్ చేసి ఉంటారు..?
- కారు పార్టీలో అంతర్గతంగా చర్చ
- 15 రోజుల వ్యవధిలో 4,013 ఫోన్ల ట్యాపింగ్
- అసెంబ్లీ ఎన్నికల టైంలోనే ఎక్కువ..
- 618 మంది లీడర్లు, జర్నలిస్టులు, ఆఫీసర్లు
- అందరి వాంగ్మూలాలను రికార్డు చేయనున్న సిట్



హైదరాబాద్ పెన్ పవర్: బీఆర్ఎస్ పార్టీకి ఫోన్ ట్యాపింగ్ టెన్షన్ పట్టుకుంది. కేసీఆర్ సొంత పార్టీ నేతలను కూడా నమ్మలేదని తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో 2023 నవంబర్ 15 నుంచి 30వ తేదీ వరకు భారీ సంఖ్యలో ఫోన్లు ట్యాప్ అయ్యాయి. ఇందులో మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్టు సిట్ నిర్ధారణకు వచ్చింది. విచారణకు రావాలంటూ వీళ్లిద్దరికి ఇవాళ సిట్ నోటీసులు జారీ చేసింది. దీంతో గులాబీ శిబిరంలో అలజడి మొదలైంది. ఎవరి ఫోన్లు ట్యాప్ చేశారో అనే అనుమానాలు నాయకుల్లో వ్యక్తమవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో 4013 ఫోన్లు ట్యాప్ అయ్యాయి. ఇందులో 618 రాజకీయ నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లు, పారిశ్రామిక వేత్తలు ఉన్నారు. వీరిలో ఆరుగురు జర్నలిస్టులు కూడా ఉన్నారు. ఈ 618 మంది లో ఇప్పటి వరకు 228 మంది స్టేట్మెంట్ రికార్డ్ చేసింది సిట్. మిగతా వారి నుంచి కూడా స్టేట్ మెంట్లు తీసుకునేందుకు సిద్ధమైంది. ఇదిలా ఉండగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డితోపాటు మల్కాజ్ గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మాజీ ఎమ్మెల్యేలు కేవీస్ రత్నం, మర్రి శశిధర్ రెడ్డి ఫోన్లు ట్యాప్ అయినట్టు సిట్ నిర్ధారణకు వచ్చింది. వీరితో పాటు ఐఏఎస్ అధికారులు రోనాల్డ్ రాస్, గౌతం ఫోన్లను కూడా ట్యాపింగ్ చేశారు. వీళ్లందరినీ విచారణకు పిలిచి స్టేట్ మెంట్లు తీసుకునేందుకు సిట్ సిద్ధమవుతోంది.

**ఇతర పార్టీల్లోని కీలక నేతలే టార్గెట్**

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఎన్నో మలుపులు తిరుగుతోంది.

అప్పటి పీసీసీ చీఫ్ ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఫోన్లతోపాటు అప్పటి బీజేపీ స్టేట్ చీఫ్? బండి సంజయ్ అనుచరులు, కుటుంబ సభ్యుల ఫోన్లు సైతం ట్యాప్ అయ్యాయి. ప్రస్తుత సమాచార శాఖ మంత్రి, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితోపాటు ఆయన కుటుంబ సభ్యులు, అనుచరుల ఫోన్లు సైతం ట్యాప్ అయ్యాయి

# బీజేపీ అభ్యర్థి ఎవరు?.. జూబ్లీహిల్స్ బైపోల్ పై చర్చ




- గతంలో మూడో స్థానానికే పరిమితమైన కమలం పార్టీ
- పరిశీలనలో ముగ్గురి పేర్లు
- ఇక్కడ 1.23 లక్షలు ముస్లింలవే
- పోటీ చేసినా గెలుపు కష్టమేనా?

హైదరాబాద్ పెన్ పవర్: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంలో ఈ సెగ్మెంట్ లో ఉప ఎన్నిక అనివార్యమవుతోంది. ఈ నేపథ్యంలో నాలుగు పార్టీలు అస్త్రాలు సర్దుకుంటున్నాయి. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లోనూ మాగంటి గోపీనాథ్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో టీడీపీ తరఫున, 2018, 2023లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఈ మూడు ఎన్నికల్లోనూ బీజేపీ మూడో స్థానానికే పరిమితమైంది. 2009లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడి నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసిన విష్ణువర్ధన్ రెడ్డి గెలుపొందగా..బీజేపీ అభ్యర్థి బాల ప్రకాశ్ ఐదో స్థానంలో నిలిచారు. 2014 లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో ఇక్కడి నుంచి బీజేపీ తమ పార్టీ అభ్యర్థిని బరిలోకి దించలేదు. పొత్తులో భాగంగా టీడీపీకి కేటాయించింది. అప్పుడు టీడీపీ అభ్యర్థిగా ఉన్న మాగంటి గోపీనాథ్ ఇక్కడ విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసిన రావుల శ్రీధర్ రెడ్డి కేవలం 8,557 ఓట్లు సాధించారు. ఆయనకు నాలుగో స్థానం దక్కింది. ఇక్కడి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నవీన్ యాదవ్ కన్నా తక్కువ ఓట్లు రావడం గమనార్హం. 2023 ఎన్నికల్లో లంకల దీపక్ రెడ్డి పోటీ చేయగా ఆయనకు 25,866 ఓట్లు వచ్చాయి.

**విజేతను నిర్ణయించేది మైనార్టీలే!**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం 3,94,886 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుషులు 2,07,932 మహిళలు 1,86,935, ఇతరులు 19 మంది ఉన్నారు. వీరిలో ముస్లింల ఓట్లే 1.23 లక్షలు కావడం గమనార్హం. ఇక్కడి నుంచి గెలవాలంటే తప్పకుండా ముస్లిం ఓట్లు రాబట్టుకోవాల్సి ఉంటుంది. మెజార్టీ ముస్లింలు బీజేపీకి ఓటేసేందుకు వెనుకాడటం సహజం. ఇక్కడి నుంచి బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేసినవారెవరూ విజయంసాధించలేక పోయారు. కనీసం రెండో స్థానంలో కూడా నిలువలేక పోవడం ఇందుకు నిదర్శనం.

**బరిలో ముగ్గురి పేర్లు!**

జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థిని నిలబెట్టేందుకు బీజేపీ సిద్ధమవుతోంది. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన లంకల దీపక్ రెడ్డిని మరో మారు బరిలోకి దించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని సమాచారం. అయితే ఈ స్థానం నుంచి మహిళా నేత కీర్తి రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ కూడా పోటీకి సై అంటున్నారు. అయితే బీజేపీ ఎవరు పోటీ చేసినా గెలుపు అంత ఈజీ కాదంటున్నారు విశ్లేషకులు.


## డెంగ్యూ, చికున్ గున్యా వ్యాపించకుండా చర్యలు తీసుకోండి




హైదరాబాద్ పెన్ పవర్: వర్షాకాలంలో డెంగ్యూ, చికున్ గున్యా లాంటి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని GHMC అధికారులను ఆదేశించారు సీఎం రేవంత్ రెడ్డి. హైదరాబాద్ లో పారిశుధ్యం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదన్నారు. హైదరాబాద్ సిటీ, అర్బన్ , సబ్ అర్బన్, రూరల్ ఏరియాల్లో వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ అధికారులతో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పెరుగుతున్న హైదరాబాద్ నగర జనాభా అవసరాలకు అనుగుణంగా రాబోయే 25 సంవత్సరాలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సీఎం అధికారులకు సూచించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌కు సంబంధించి ప్రత్యేకంగా సమగ్రమైన పాలసీని తయారు చేయాలని ఆదేశించారు.ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌లో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించాలని సీఎం చెప్పారు. తాగునీటి సరఫరా, డ్రైనేజ్, రోడ్లు, మెట్రో కనెక్టివిటీ, ఎలివేటెడ్ కారిడార్లకు సంబంధించి పూర్తి ప్రణాళికలను తయారు చేయాలన్నారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ (%+ఎవీజ%)పరిధిలో కొనసాగుతున్న తాగునీటి సరఫరా, సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ పనుల్లో ప్రస్తుత పరిస్థితిని అధికారులు వివరించారు. అసంపూర్తిగా ఉన్న పనులను సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలని చెప్పారు. ముఖ్యంగా నగరంలో పారిశుధ్యం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని, వర్షాకాలంలో డెంగ్యూ, చికున్ గున్యా లాంటి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు సీఎం రేవంత్ రెడ్డి.

# హైదరాబాద్ జనానికి బిగ్ అలర్ట్ : రేపటి నుంచి జూలై 24 వరకు సిటీలో ట్రాఫిక్ డైవర్షన్స్.. కాదని వెళితే ఇరుక్కుపోతారు







**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో బోనాల సందడి మొదలైంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ చకచకా జరిగిపోతున్నాయి. రాబోయే శ్రీ జగదాంబ మహంకాళి గోల్కొండ బోనాల ఉత్సవాలు జూన్ 26 నుండి జూలై 24 వరకు జరగనున్నాయి. ఈ పండుగకు తెలంగాణ, ఆంధ్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో నగరానికి చేరుకునే అవకాశం ఉంది. దీంతో నగర వ్యాప్తంగా ట్రాఫిక్ ఆక్షలు విధిస్తున్నారు ట్రాఫిక్ పోలీసులు.

జూన్ 26న తొలి పూజ తో ప్రారంభమయ్యే మహంకాళీ బోణాలు జులై 24 వరకు కొనసాగుతాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని పండుగ ఫలితంగా ఏర్పడే ట్రాఫిక్ రద్దీని ఎదుర్కోవడానికి హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు భక్తుల కోసం మళ్లింపులు, ప్రత్యేక పార్కింగ్ జోన్‌లు, అలాగే హెల్ప్‌లైన్‌లను ప్రకటించారు. ఉత్సవాల సమయంలో ముఖ్యంగా రద్దీ ఎక్కువగా ఉండే గోల్కొండ కోటకు వెళ్లే మార్గాలకు సంబంధించిన ట్రాఫిక్ ఆక్షలను ప్రకటించారు. హైదరాబాద్ బోనాల సందర్భంగా జూన్ 26, 29, జులై 3, 6, 10, 13, 17, 20, 24 తేదీలలో ట్రాఫిక్ డైవర్షన్స్ ఉంటాయి.

**ట్రాఫిక్ డైవర్ట్ చేసే మార్గాలు:**

రాందేవ్ గూడ నుంచి మక్కా దర్వాజ మీదుగా గోల్కొండ వెళ్లే రూట్

ఫతే దర్వాజా మీదుగా లంగర్ హౌజ్ నుండి గోల్కొండ కోట వెళ్లే మార్గం


బంజారా దర్వాజా ద్వారా గోల్కొండ కోటకు 7 టూంబ్స్, షేక్‌పేట నాలాపండుగ సందర్భంగా ఉదయం 8 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు వాహనదారులు ఈ రూట్లను అవాయిడ్ చేయడం మంచిదని సూచించారు.

**భక్తుల పార్కింగ్ జోన్లు:**

మక్కా దర్వాజ మీదుగా రాందేవ్ గూడ వచ్చే వాహనదారులకు అషూర్ ఖానా, ఆర్మీ సెంట్రీ పోస్ట్, రాందేవ్ గూడ, గోల్కొండ ప్రాంతాలలో పార్కింగ్ ఏర్పట్లు చేశారు. అదేవిధంగా సెట్విన్ బస్సులను అషూర్ ఖానా పార్కింగ్ వరకు మాత్రమే అనుమతిస్తారు.ఫతే దర్వాజా మీదుగా లంగర్ హౌజ్ నుంచి వచ్చే భక్తులకు MCH పార్క్, ఫతే దర్వాజాబీ గోల్కొండ బస్ స్టాప్‌బీ అల్బీరా స్కూల్, ఏరియా హాస్పిటల్, గోల్కొండ ప్రాంతాలలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. షేక్‌పేట్ నుండి బంజారా దర్వాజా మీదుగా వచ్చే భక్తులకు గోల్ఫ్ క్లబ్ రోడ్ బై-లేన్, హాకీ గ్రౌండ్‌బీ ఒవైసీ గ్రౌండ్‌బీ డెక్కన్ పార్క్, సెవెన్ టూంబ్స్ ఏరియాల్లో పార్కింగ్ ఉంటుంది. ట్రాఫిక్ జామ్ కారణంగా వచ్చే సమస్యల కోసం o91 9010203626 అనే ట్రాఫిక్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయవచ్చు . సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ X (ట్విట్టర్) హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఎప్పటికప్పుడు అప్ డేట్స్ ఇస్తుంటారు.

# పెద్దపులికి ఘనంగా అంత్యక్రియలు.. వేలాది మంది అభిమానులు, పర్యాటకుల నివాళి





**హైదరాబాద్ పెన్ పవర్:**మనుషులకు అంత్యక్రియలు నిర్వహించడం సాధారణం..అప్పుడప్పుడు తమకు ఇష్టమైన పెంపుడు జంతువులకు కూడా అంత్యక్రియలు నిర్వహించడం కూడా చూస్తుంటాం.. అయితే పెద్దపులికి అంత్యక్రియలు చేయడం ఎప్పుడైనా చూశారా..? ఇక్కడో ఓ ఫేమస్ పెద్దపులికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు ఫారెస్ట్ అధికారులు. ఆ పులికి వీడ్కోలు పలికేందుకు దాని అభిమానులు, ఫోటోగ్రాఫర్లు, ఫారెస్ట్ అధికారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆ పెద్ద పులికి ఉన్న ప్రత్యేకతలేంటీ.. అంతమంది అభిమానులను ఎలా సంపాదించింది. ఎలా చనిపోయింది.. పూర్తి వివరాల్లోకి వెళితే.. రణతంబోర్ అభయారణ్యం రాజస్థాన్ రాష్ట్రంలో సవాయ్ మాధోపూర్ జిల్లాలో ఉంది. ఇది ఉత్తర భారతదేశంలోనే అతిపెద్ద ,ప్రసిద్ధ జాతీయ పార్కులలో ఒకటి. రణతంబోర్ అభయారణ్యంలో ఎంతో ప్రసిద్ధి చెందిన ఆడపులి ఆరోహెడ్ జూన్ 19న మరణించింది. అభయారణ్య నిబంధనల ప్రకారం ఆరోహెడ్ కు అంత్యక్రియలు నిర్వహించారు అధికారులు. 11 యేళ్ల వయసున్న ఆరోహెడ్ బ్రెయిన్ ట్యూమర్ తో చనిపోయింది. జోగి మహల్ సమీపంలో ఆరోహెడ్ మృతదేహాన్ని గుర్తించిన అధికారులు.. రాజ్‌బాగ్‌లో నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ ప్రోటోకాల్స్ ప్రకారం దహనం చేశారు. ఈ అంత్యక్రియలకు ఫారెస్ట్ అధికారులు, వన్యప్రాణి ఫోటోగ్రాఫర్‌లు, పర్యాటకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఆరోహెడ్.. రణతంబోర్లో అత్యంత ఫోటోలు తీసిన పులులలో ఒకటి. ఇది రణతంబోర్ "రాణి"గా పేరుగాంచిన ప్రసిద్ధ ఆడపులి మచ్లీ (%%-16) మనవరాలు. ఆరోహెడ్ తన తల్లి కృష్ణ (%%-19) మాదిరిగానే ధైర్యం, వేటాడే నైపుణ్యాన్ని కలిగి ఉంది. ముఖ్యంగా మొసళ్లను వేటాడడంలో ఆరోహెడ్ ప్రసిద్ధి. ఆరోహెడ్ తన జీవితకాలంలో నాలుగు సార్లు పిల్లలను కన్నది. మొత్తం 10 పిల్లలకు జన్మనిచ్చింది. దీని సంతానం రణతంబోర్ ,ఇతర పులుల సంరక్షణ కేంద్రాల్లో పులుల సంఖ్యను పెంచడంలో సహాయపడింది. ఆరోహెడ్ చిన్న కూతురు కంకటిని (%%-2507) ముకుంద్రా హిల్స్ టైగర్ రిజర్వ్‌కు తరలించిన కొద్ది గంటల్లోనే అది మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. ఆరోహెడ్ మరణం రణతంబోర్‌కు ఒక శకం ముగిసినట్లుగా భావిస్తున్నారు. ఆమె వన్యప్రాణి సంరక్షణకు ఒక చిహ్నంగా రణతంబోర్ కథలో కీలక భాగంగా నిలిచిపోయిందన్నారు. ఆరోహెడ్ వారసత్వం దాని పిల్లల ద్వారా కొనసాగుతుందంటున్నారు అధికారులు.


# ఈ అమ్మాయి ఎంతకు తెగించింది : పెళ్లి చేసుకోవటం లేదని.. అబ్బాయి పేరుతో 11 రాష్ట్రాలకు బెదిరింపులు..!

**హైదరాబాద్ పెన్ పవర్:**దేవుడా.. ఓరి దేవుడా.. ఏంటీ ఈ అమ్మాయిలు ఇలా ఉన్నారు అనే రోజులు వచ్చేశాయి.. ఇష్టం లేని పెళ్లి చేస్తే.. పది రోజుల్లోనే మొగుడిని లేపేస్తున్నారు.. ప్రేమ గీమా ఏంటీ అని పేరంట్స్ తిడితే వాళ్లను చంపేస్తున్నారు.. నిన్నటికి నిన్న ఫస్ట్ నైట్ రోజు టచ్ చేస్తే.. ముక్కలుగా నరుకుతా అని వార్నింగ్ ఇచ్చిందో ఇంకో భార్య.. ఇలా ఒకటా.. రెండా.. ఎన్ని ఎన్నెన్ని ఘోరాలు చేస్తున్నారో తెలుసా.. లేటెస్ట్ గా.. ఇప్పుడు మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. చెన్నై సిటీకి చెందిన యువతి.. ఓ అబ్బాయిని ప్రేమించింది.. పద్దతిగా పెళ్లి చేసుకోమని కోరింది.. ఆ అబ్బాయి మాత్రం నాకు నీ ప్రేమ వద్దు.. నీతో పెళ్లి వద్దు అని చెప్పాడు.. అంతే నేను అడిగితే పెళ్లి చేసుకోను అంటావా అంటూ.. ఆ అమ్మాయి ఏకంగా 11 రాష్ట్రాలకు చెమటలు పట్టించింది.. ఉరుకులు పరుగులు పెట్టించింది.. ఈ విషయం పూర్తి వివరాల్లోకి వెళితే.. పోలీసుల వివరాల ప్రకారం. . రెనె జోషిల్డా అనే యువతి చెన్నైలోని ఇంజినీరింగ్ పూర్తి చేసి డెలాయిట్ లో సీనియర్ రోబోటిక్స్ కన్సల్టెంట్ గా పనిచేస్తోంది. కంపెనీ వర్చువల్ సమావేశాల మీటింగ్ ల సమయంలో దివిజ్ ప్రభాకర్ అనే









సహోద్యోగితో పరిచయం ఏర్పడింది. ప్రభాకర్ ను ప్రేమించింది. అయితే ఆమె ప్రేమను తిరస్కరించాడు ప్రభాకర్. దీంతో దివిజ్ తో కలిసి ఉన్నట్లుగా ఫోటోలు చిత్రీకరించి పెళ్లి చేసుకున్నామని వాళ్ల స్నేహితులకు పంపించి ప్రచారం చేసేది. దీనిపై ప్రభాకర్ చెన్నై సైబర్ సెల్ లో ఫిర్యాదు చేశాడు. అయితే ప్రభాకర్ కు వేరే అమ్మాయితో పెళ్లి జరగబోతుందని తెలుసుకున్న జోషిల్డా. ఎలాగైనా ప్రభాకర్ పై పగ తీర్చుకోవాలనుకున్న జోషిల్డా దివిజ్ ప్రభాకర్ పేరుతో ఫేక్ ఈ మెయిల్ ఐడీలు సృష్టించింది.

ఫిబ్రవరి, జూన్ 2025 ప్రభాకర్ పేరుతో ఉన్న పేక్ ఈ మెయిల్ ఐడీ ఉపయోగించి గుజరాత్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్రతో సహా 11 రాష్ట్రాల్లోని పాఠశాలలు, స్టేడియంలు, ఆసుపత్రులకు బాంబు బెదిరింపు ఈమెయిల్స్ పంపింది. నరేంద్ర మోడీ క్రికెట్ స్టేడియం, పాఠశాలలు, అహ్మదాబాద్‌లోని సివిల్ ఆసుపత్రులు వంటి ప్రదేశాలను పేల్చివేస్తామని బెదిరిస్తూ పలు సంస్థలకు మొత్తం 21 ఈమెయిల్‌లను పంపింది. జూన్ 12న అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాద ఘటనలో సైతం రెనే ఓ బెదిరింపు మెయిల్ పంపినట్లు పోలీసులు గుర్తించారు. ఆమెను అరెస్టు చేశామని అధికారులు తదుపరి దర్యాప్తు కోసం 11 రాష్ట్రాలకు సమాచారం అందిస్తున్నట్లు జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సింఘాల్ తెలిపారు.

ఆమె తన మాజీ సహోద్యోగి దివిజ్ ప్రభాకర్‌ను ఇరికించడానికే ఇదంతా చేసింది, అతను ఆమెను వివాహం చేసుకోవడానికి నిరాకరించాడు. అందుకే ఆమె ఇలా చేసిందని జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (క్రైమ్) శరద్ సింఘాల్ మీడియాకు తెలిపారు. జోషిల్డా గతంలో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో అనేక ఫేక్ ఐడీలను సృష్టించి తనకు పరిచయం ఉన్నవారిని చిలిపిగా, వేధించిందని సింఘాల్ అన్నారు. ఇటువంటి బెదిరింపు ఇమెయిల్‌లను పంపి మానసిక వేధింపులకు గురిచేసేదని చెప్పారు.

# హైకోర్టు ముహూర్తం పెట్టింది.. ఇక రేవంత్ రెడీయేనా?



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో కీలక పరిణామం చోటు చేసుకుంది. స్థానిక సంస్థలకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియకు హైకోర్టు ముహూర్తం పెట్టేసింది. మూడు మాసాల్లో ఎన్నికలు నిర్వహించాలని తేల్చి చెప్పింది. తాజాగా ఈ మేరకు హైకోర్టు తీర్పు వెలువరించింది. అదేసమయంలో 30 రోజుల్లోనే వార్డుల విభజన కూడా పూర్తి చేయాలని ఏక సభ్య ధర్మాసనం తీర్పు చెప్పింది. దీంతో ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి రెడీ అవుతారా? లేక.. దీనిని ద్విసభ్య ధర్మాసనం ముందు సవాలు చేస్తారా? అన్నది చూడాలి. 2024, ఫిబ్రవరితోనే తెలంగాణలోని గ్రామ పంచాయతీల పాలక వర్గాలకు సమయం ముగిసింది. అయితే.. వివిధ కారణాలతో ప్రభుత్వం ఈ ఎన్నికలను నిర్వహించలేక పోయింది. మరీ ముఖ్యంగా కుల గణన చేపట్టి దాని ప్రకారం.. ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకుంది. అయితే.. ఇది మరింత జాప్యం చేసింది. మరోవైపు.. పంచాయతీ ప్రెసిడెంట్లు, కార్యకర్తలుగా ఉన్న వారు న్యాయ పోరాటానికి దిగారు. ఇది హైకోర్టు వరకు చేరింది. సుమారు ఏడాదికిపైగా కోర్టులో వాద ప్రతివాదాలు జరిగాయి.


ఇటీవల జరిగిన వాదనల్లో తాము ఎన్నికలు నిర్వహించేందుకు 30 రోజుల సమయం కావాలని ప్రభుత్వం కోరింది. మరోవైపు ఎన్నికల సంఘం అధికారులు తమకు 60 రోజుల సమయం కావాలని కోరారు. ఈ క్రమంలో తాజా హైకోర్టు ఇరు పక్షాలకు మరింత సమయం ఇస్తూ.. 90 రోజుల్లో ఎన్నికలు పూర్తి చేయాలని పేర్కొంది. అయితే.. వాస్తవానికిపైకి చెబుతున్నట్టు ప్రభుత్వం 30 రోజుల్లో ఎన్నికలు పూర్తి చేయాలని భావించడం లేదు.

కుల గణన, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి కీలక అంశాలను పూర్తి చేసిన తర్వాత.. ఏర్పడే సానుకూలతను తమకు అనుకూలంగా మారే వరకు ఎదరు చూస్తోంది. ఈ క్రమంలో కోర్టు తీర్పు మేరకు ఎన్నికలు నిర్వహిస్తారో.. లేక, అప్పీల్‌కు వెళ్తారో చూడాలి. ఏదేమైనా.. ఇప్పుడు తెలంగాణలో స్థానిక సమరంపై జోరుగా నే చర్చ సాగుతోంది.

# ప్రేమకు అడ్డొస్తుందని ప్రియుడితో కలిసి తల్లిని చంపిన కన్న కూతురు

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్‌లోని జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన అంజలి హత్య కేసును పోలీసులు కేవలం 24 గంటల్లో ఛేదించారు. ప్రేమ వ్యవహారానికి అడ్డు వస్తోందన్న కారణంతో పదో తరగతి చదువుతున్న కుమార్తె, ఆమె ప్రియుడు, అతని సోదరుడితో కలిసి తల్లిని దారుణంగా హత్య చేసిందని బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన బుధవారం బాలానగర్‌లోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలియజేశారు.





డీసీపీ సురేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, మృతురాలు అంజలి (39) కుమార్తె (మైనర్) కొంతకాలంగా శివ (19) అనే యువకుడితో ప్రేమ వ్యవహారం కొనసాగిస్తోంది. శివ డీజే ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడని, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బాలికకు పరిచయమయ్యాడని పోలీసులు తెలిపారు. వీరి ప్రేమ వ్యవహారాన్ని తల్లి అంజలి వ్యతిరేకిస్తూ వచ్చింది. ఈ క్రమంలో కొన్ని నెలలుగా తల్లికూతుళ్ల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. తన ప్రేమకు తల్లి అడ్డుగా ఉందని భావించిన బాలిక, ఆమెను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుంది.

ఈ నెల 19న బాలిక ఇంట్లోంచి వెళ్లిపోవడంతో, ఆందోళన చెందిన తల్లి అంజలి 20వ తేదీన జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో కిడ్నాప్ కేసు పెట్టారు. అయితే, బాలిక అదే రోజు (20వ తేదీ) రాత్రి ఇంటికి తిరిగి వచ్చింది. అనంతరం, ఈ నెల 23న షాపూర్‌నగర్‌లోని వారి ఇంట్లో అంజలి పూజ చేసుకుంటున్న సమయంలో, బాలిక తన ప్రియుడు శివ, అతని తమ్ముడితో కలిసి పథకం ప్రకారం దాడి చేసింది. చున్నీతో అంజలి గొంతు నులిమి, తలపై బలంగా కొట్టి హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలిందని డీసీపీ వివరించారు.

"ప్రేమ వ్యవహారానికి అడ్డు వస్తుందనే ఉద్దేశంతోనే తల్లిని హత్య చేసినట్లు నిందితురాలైన బాలిక విచారణలో అంగీకరించింది. ముగ్గురు నిందితులపై హత్యానేరం కింద కేసు నమోదు చేసి, వారిని రిమాండ్‌కు తరలించాం" అని డీసీపీ సురేష్ కుమార్ తెలిపారు.

# హైదరాబాద్‌లో విషాదం.. నిశ్చితార్థమైన టెకీ ఆత్మహత్య

- హైదరాబాద్ మియాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య
- మృతుడు అనిల్ అమిత్ చౌడగా గుర్తింపు
- నవంబర్‌లో వివాహం జరగాల్సి ఉండగా దారుణం
- మానసిక రుగ్మతలు, ఒత్తిడే కారణమని తల్లిదండ్రుల వాంగ్మూలం
- గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ నగరంలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. మరికొద్ది నెలల్లో వివాహం జరగాల్సిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హఫీజ్‌పేటలో జరిగింది. మృతుడిని అనిల్ అమిత్ చౌద (30)గా గుర్తించారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, అనిల్ అమిత్ చౌద స్థానికంగా ఉన్న ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ, హఫీజ్‌పేటలో తన తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. అతనికి ఇటీవల ఓ యువతితో నిశ్చితార్థం జరిగింది. ఈ ఏడాది నవంబర్‌లో వారి వివాహం జరిపించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.మంగళవారం రాత్రి అనిల్ తన గదిలోకి వెళ్లిన తరువాత ఎంతకీ బయటకు రాకపోవడంతో తల్లిదండ్రులకు అనుమానం కలిగింది. తలుపు తట్టినా స్పందన లేకపోవడంతో, వారు తలుపులు బద్దలుకొట్టి లోపలికి వెళ్లి చూడగా, అనిల్ సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. ఆ దృశ్యం చూసిన తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురై, కన్నీరుమున్నీరుగా విలపించారు. వెంటనే వారు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మానసిక రుగ్మతలు, తీవ్రమైన ఒత్తిడి కారణంగానే తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనిల్ తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# విమాన ప్రమాద బాధితుల ఆవేదన.. ఓ హాస్టల్ జీవితం తలకిందులైంది

**హైదరాబాద్ పెన్ పవర్:**అహ్మదాబాద్‌లోని మేఘానీనగర్ ప్రాంతంలో జరిగిన ఘోరమైన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం, బీజే మెడికల్ కాలేజ్, అనుబంధ ఆసుపత్రుల విద్యార్థుల జీవితాలను చిన్నాభిన్నం చేసింది. ఈ దుర్ఘటనలో కొంతమంది వైద్య విద్యార్థులు ప్రాణాలు కోల్పోగా, హాస్టల్ భవనాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. లక్షల రూపాయల ఆస్తి నష్టం సంభవించి, విద్యార్థుల జీవితాలు తలకిందులయ్యాయి.

**తీవ్రంగా ప్రభావితమైన వసతిగృహాలు**

ప్రమాదం ధాటికి అతుల్యం 1, 2, 3, 4 భవనాలు, మెస్ హాల్‌తో సహా పలు నిర్మాణాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ దుర్ఘటనలో విద్యార్థులు తమ వ్యక్తిగత వస్తువులు, విద్యా సామగ్రి, వాహనాలను కోల్పోయారు. మొత్తం నష్టం సుమారు రూ.2.7 కోట్లుగా అంచనా వేశారు.



**పునరావాస చర్యలలో అసమర్థత**

ప్రమాదం జరిగిన వెంటనే విద్యార్థులను హాస్టళ్లను ఖాళీ చేయమని ఆదేశించడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. కొందరు విద్యార్థులకు సహాయం లభించినప్పటికీ, చాలామంది తమ విలువైన వస్తువులను వదిలి వెళ్లాల్సి వచ్చింది. శాశ్వత నివాసాల కోసం వారు ఇప్పటికీ ఎదురు చూస్తున్నారు, ఇది వారి భవిష్యత్తుపై ఆందోళనలను పెంచుతోంది.

**మానసిక నష్టంతో భవిష్యత్తుపై భయాలు**

శారీరక గాయాలతో బాధపడుతున్న వారి కంటే, ఈ భయానక ఘటనలను ప్రత్యక్షంగా చూసిన విద్యార్థులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ నిద్రలేమి, భయాలు వంటి సమస్యలు వారిని వెంటాడుతున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, అధికారులు పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను అమలు చేయాలని యోచిస్తున్నారు.

**కొన్ని ఆశలు, మలుపులు**

ప్రస్తుతం కొంతమంది విద్యార్థులు తాత్కాలిక హాస్టళ్లలో నివసిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం, నాలుగు నెలల్లో కొత్త హాస్టళ్లను సిద్ధం చేయనున్నారు. కొంతమంది బాధితులకు ముందస్తు వసతి లభించినప్పటికీ, మెజారిటీ విద్యార్థులు ఇంకా అభద్రతా పరిస్థితుల్లోనే జీవిస్తున్నారు.

ఈ ప్రమాదం వారి జీవితాలపై చెరగని ముద్ర వేసింది. ప్రాణాలతో బయటపడినవారు ఇప్పుడు మానవత్వం, మద్దతు కోసం ఎదురుచూస్తున్నారు. శారీరక చికిత్సల కంటే, ఈ దశలో వారికి మానసిక భరోసా అత్యవసరం. వారి గాయాలను మాన్పడానికి , భవిష్యత్తుపై నమ్మకాన్ని కలిగించడానికి సామూహిక మద్దతు అవసరం.

# హైదరాబాద్ హెూటల్ గదిలో బ్యూటీషియన్ అనుమానాస్పద మృతి




**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ నగరంలోని రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో బ్యూటీషియన్ అనుమానాస్పద మృతి కలకలం రేపింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనలో మృతి చెందిన బ్యూటీషియన్‌ను అనూష (26)గా గుర్తించారు. ఈ సంఘటన సోమవారం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. అనూష వృత్తిరీత్యా బ్యూటీషియన్. భర్తతో మనస్పర్థలు రావడంతో కొంతకాలంగా బీహెచ్‌ఈఎల్ సమీపంలో తన తల్లిదండ్రులతో కలిసి ఉంటోంది. ఆదివారం తన స్నేహితులను కలవడానికి వెళు తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన అనూష ఆ తర్వాత ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆమెకు ఫోన్ చేయడానికి ప్రయత్నించగా, స్పందన రాలేదు.

**హెూటల్ గదిలో మృతదేహం**

సోమవారం అనూష ఒక హెూటల్ గదిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఆమె స్నేహితుడు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. అనూష ఆత్మహత్య చేసుకుందని అతను తెలిపాడు. వెంటనే హెూటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. అనూష మృతి పట్ల ఆమె కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది ఆత్మహత్య కాదని వారు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో అనూష సోదరుడు రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన సోదరి మృతిపై అనుమానాలున్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఆయన కోరారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సింగయ్య మృతి.. జగన్ ర్యాలీలపై నిషేధం విధించాలని వైఎస్ షర్మిల డిమాండ్

**హైదరాబాద్ పెన్ పవర్:** రెంటపాళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగయ్య అనే వ్యక్తి మృతి చెందిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మరోమారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. ఈ దుర్ఘటనకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదే బాధ్యత అని ఆమె ఆరోపించారు.గుంటూరులో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, సింగయ్య మృతికి జగన్‌కు బాధ్యత లేదా అని షర్మిల ప్రశ్నించారు. “పోలీసులు కేవలం మూడు కార్లకు మాత్రమే అనుమతి ఇచ్చినప్పుడు, వేల మందితో కలిసి జగన్ ఎలా పర్యటన నిర్వహించారు?” అని ఆమె నిలదీశారు. ప్రమాదంలో కారు కింద పడిపోయిన వ్యక్తిని ఏమాత్రం పట్టించుకోకుండా జగన్ తన పర్యటనను కొనసాగించడం దారుణమని షర్మిల అన్నారు. జగన్ గతంలో కూడా అనేక తప్పులు చేశారని, అందుకే ఆయనపై కేసులు నమోదయ్యాయని ఆమె గుర్తు చేశారు.ఈ ఘటనలో పోలీసుల వైఖరిని కూడా షర్మిల తప్పుపట్టారు. “వేల మందితో నిబంధనలకు విరుద్ధంగా వస్తుంటే పోలీసులు ఎందుకు అడ్డుకోలేదు?” అని ఆమె ప్రశ్నించారు. జగన్ నిర్వహించే ప్రతి పర్యటన జన సమీకరణ, బలప్రదర్శన కోసమేనని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాదని ఆమె విమర్శించారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు జగన్ ఏ ఒక్క సమస్యను కూడా పట్టించుకోలేదని ఆరోపించారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే, జగన్ నిర్వహించే ప్రదర్శనలు, పర్యటనలను తక్షణమే నిషేధించాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ప్రజల భద్రతను గాలికొదిలి, నిబంధనలను ఉల్లంఘిస్తూ సాగే ఇలాంటి కార్యక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామాలు.. 4013 ఫోన్ నంబర్లను ట్యాపింగ్ చేసిన ప్రణీత్ రావు అండ్ టీం



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్?గా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. 2023 నవంబర్ 15 నుంచి నవంబర్ 30 వరకు భారీగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు దర్యాప్తు అధికారులు తేల్చారు. 4013 ఫోన్ నంబర్లను మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు అండ్ టీమ్ ట్యాపింగ్ చేసినట్లు తేలింది. ఫోన్ ట్యాపింగ్ బాధితులు 618 మంది ఉండగా.. ఇందులో పొలిటికల్ లీడర్లు కూడా ఉన్నారు. 618 మందిలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ , పారిశ్రామిక వేత్తలు, జర్నలిస్టులు కూడా ఉండటం గమనార్హం. రేవంత్ రెడ్డి ఆయన కుటుంబ సభ్యులు, బండి సంజయ్ కుటుంబ సభ్యులు, ఈటెల రాజేందర్ ఆయన కుటుంబ సభ్యులు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులతో పాటు అనుచరుల ఫోన్లు ట్యాప్ అయినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

త్వరలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మైనంపల్లి హనుమంత రావు, మాజీ ఎమ్మెల్యే %ఖూ% రత్నం , మర్రి శశిధర్ రెడ్డి, %దీ=ూ% నేతలు, మాజీ ఎమ్మెల్యే లు పద్మా దేవేందర్ రెడ్డి , మర్రి జనార్ధన్ రెడ్డి, తాటి కొండ రాజయ్యలకు నోటీస్ ఇవ్వాలని సిట్ నిర్ణయించింది. ఐఏఎస్?లు రోనాల్డ్ రాస్, గౌతంల ఫోన్లు కూడా ట్యాపింగ్ అవడం గమనార్హం. పోలీసులు ఇప్పటి వరకు 228 మంది స్టేట్మెంట్స్ రికార్డ్ చేశారు. ఇదిలా ఉండగా.. ప్రణీత్ రావు నేడు(బుధవారం) మరో సారి సిట్ ఎదుట విచారణకు హాజరు కానున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్ఐబీ కేంద్రంగా ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో ఫోన్ ట్యాపింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏ2గా ఉన్న మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్ రావు సిట్‌కు తెలిపిన వివరాల మేరకు.. రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ ప్రభాకర్ రావును మాజీ సీఎం కేసీఆర్ ఓఎస్డీగా బాధ్యతలు అప్పగించారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ చీఫ్‌గా నియమించారు. ఆ తర్వాత స్పెషల్ ఆపరేషన్స్ టార్గెట్ (ఎస్ఓటీ) టీమ్‌ను ఏర్పాటు చేశారు. దీనికి ప్రణీత్ రావు చీఫ్‌గా పని చేశారు.

బీఆర్ఎస్ సర్కార్?కు వ్యతిరేకంగా పనిచేసే సొంత పార్టీ నేతలు సహా కాంగ్రెస్, బీజేపీ, వ్యాపారవేత్తలు, పౌరహక్కుల నేతలు చివరకు జడ్జిల ఫోన్?లను ట్యాప్ చేశారు. బేగంపేట్‌లోని ఎస్ఐబీ ఆఫీస్ కేంద్రంగా ఎస్ఓటీకి ప్రత్యేక గదులు కేటాయించారు. కేసీఆర్, సీఎంవో, ప్రభాకర్ రావు అందించిన వివరాలతో ప్రణీత్ రావు సుమారు 4,200కి పైగా ఫోన్ నంబర్లతో ప్రొఫైల్స్ క్రియేట్ చేశాడు.

# మీరు మధ్య తరగతినా.. ముంబైలో లగ్జరీ ఇల్లు కొనాలంటే ఎన్ని సంవత్సరాలు కష్టపడాలో తెలుసా..!



**హైదరాబాద్ పెన్ పవర్:** మెట్రో నగరాల్లో లగ్జరీ ఇళ్లకు డిమాండ్ కొనసాగుతూనే ఉంది. అయితే ఇటీవల వచ్చిన సంచలన నివేదిక ప్రకారం ఆర్థిక రాజధాని ముంబైలో ఇల్లు కొనటం కలగానే మిగిలిపోతుందని తెలుస్తోంది. నెలకు రూ.10 లక్షలకు పైనే సంపాదిస్తున్న వారు సైతం ఏళ్ల పాటు డబ్బు దాచుకోవాల్సిందేనని నేషనల్ హౌసింగ్ బోర్డ్ డేటా ప్రకారం వెల్లడైంది.

సగటు సైజ్ ఉన్న ఇల్లు కొనాలన్నా ముంబైలో అధిక ఆదాయం కలిగిన వ్యక్తులు 109 ఏళ్ల పాటు డబ్బు దాచుకోవాల్సి ఉంటుందని నివేదించబడింది. ఈ స్టడీలో ప్రజలు తమ ఆదాయంలో 5 శాతం డబ్బును దాచుకుని కనీసం 1184 చదరపు అడుగుల ఇంటిని కొనుక్కోవటానికి పట్టే కాలాన్ని లెక్కించబడింది. ఇదే క్రమంలో గురుగ్రామ్, హర్యాణా వంటి పెద్ద నగరాల్లో కనీసం 64 ఏళ్ల పాటు డబ్బు దాచుకోవాల్సి ఉంటుందని నివేదించబడింది. ఇక ఐటీ రాజధాని బెంగళూరులో 36 ఏళ్లు, దేశరాజధాని దిల్లీలో 35 ఏళ్లు, చండీఘడ్ నగరంలో 15 ఏళ్లు సంపాదనను దాచుకోవాల్సి ఉంటుందని %చీఎదీ% రిపోర్ట్ పేర్కొంది.

అయితే ఈ రిపోర్టుపై ప్రజలు భిన్నంగా స్పందిస్తున్నారు. ముంబైలో చాలా మంది సగటున ఏడాదికి రూ.15 నుంచి రూ.20 లక్షలు సంపాదిస్తున్నారని.. గురుగ్రాములో కూడా ఆదాయాలు భారీగానే ఉన్నాయని కానీ రిపోర్టు తప్పుడు గణాంకాలను చూపిస్తోందని ఒక యూజర్ పేర్కొన్నారు. మరికొందరు ముంబైలో సంపాదించేవారు సైతం సొంతిల్లు కొనుక్కోలేకపోవటం ఆశ్చర్యకరం అని అన్నారు.

అయితే ప్రముఖ సంస్థ అనరాక్ గత నవంబరులో ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం దేశంలోని ప్రధాన నగరాల్లో లగ్జరీ నివాసాలకు డిమాండ్ భారీగా పెరిగిపోతున్నట్లు తేలింది.

ముంబైకి చెందిన రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ తన నివేదికలో.. న్యూదిల్లీ, ముంబైతో సహా టాప్ 7 నగరాల్లో సగటు ఇంటి ధర ఏప్రిల్–సెప్టెంబర్ కాలంలో ఏడాది ప్రాతిపదికన 23 శాతం పెరిగి రూ.1.23 కోట్లకు చేరుకుందని వెల్లడించింది. విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు ఇక్కడి నగరాల్లో విలాసవంతమైన నివాసాలు కొనుగోలు చేయటం పెరగటమే ధరల పెరుగుదలకు కీలక కారణాల్లో ఒకటిగా వారు చెబుతున్నారు. హైదరాబాదులో కూడా ఇళ్ల ధరలు 37 శాతం పెరిగినట్లు అనరాక్ నివేదించింది.

## వెంటనే మీ పాస్‌వర్డ్స్ అన్నీ మార్చేసుకోండి.. గూగుల్, FB వంటివి ఏవైనా సరే..

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ వ్యాప్తంగా 1600 కోట్ల అకౌంట్లకు సంబంధించిన డేటా లీక్ అయినట్లు సంచలన రిపోర్ట్స్ బయటకు వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై ఇండియన్ కంప్యూటర్ రెస్పాన్స్ టీమ్ ప్రజలకు కీలక అడ్వైజరీని జారీ చేసింది. ప్రజలు తమ ఖాతాలు సైబర్ సెక్యూరిటీ ప్రమాణాలకు అనుగుణంగా మార్చుకోవటం వల్ల నేరగాళ్ల బారిన పడకుండా ఉంటారని పేర్కొంది. డేటా బ్రీచ్ కారణంగా యూజర్ నేమ్స్, పాస్ వర్డ్స్, అథెంటికేషన్ టోకెన్స్, మెటా డేటా లీకైనట్లు నివేదించబడింది. అయితే ఈ సమాచారం గూగుల్, మెటా, ఆపిల్, ఫేస్ బుక్, టెలిగ్రామ్, గిట్ హబ్ అలాగే అనేక వీపీఎన్ సేవలకు సంబంధించిన లీక్ అయినట్లు వెల్లడైంది. అందువల్ల ప్రజలు తమ డిజిటల్ ఖాతాల పాస్ వర్డ్స్ మార్చేయాలని సీఈఆర్టీ పేర్కొంది. అలాగే వీలైనంత వరకు మల్టీ ఫ్యాక్టర్ వెరిఫికేషన్ అథెంటికేషన్ ఫీచర్లకు మారాలని చెప్పింది. అలాగే వ్యక్తులు తమ డిజిటల్ అసెట్స్ లో యాంటి వైరస్ స్కాన్స్ చేపట్టడంతో పాటు తాజా వర్షన్లను సిస్టమ్స్ అప్ గ్రేడ్ చేసుకోవటం మంచిదని సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ సూచిస్తోంది. డార్క్ వెబ్‌లో అందుబాటులో ఉందని భావిస్తున్న ఈ భారీ డేటాసెట్.. 30 వేర్వేరు వనరుల నుంచి సంకలనం చేయబడిందని, ఎక్కువగా ఇన్ఫోస్టీలర్ మాల్వేర్ ద్వారా తయారు చేయబడిందని తెలుస్తోంది. ఈ డేటాసెట్ దాడి చేసేవారు ఫిషింగ్, ఖాతా టేకోవర్లు, రాన్సమ్‌వేర్ దాడులు, వ్యాపార ఇమెయిల్ దుర్వినియోగానికి సైబర్ నేరగాళ్లు వీటిని వినియోగిస్తారని నిపుణులు హెచ్చరిస్తారు. భద్రత కోసం ప్రజలు తమ పాస్‌వర్డ్ లను వెంటనే మార్చుకోవాలని సూచించబడింది.

## సర్వేయర్ తేజేశ్వర్ కేసు: తిరుమల రావు దొరికాడు.. ఇప్పుడు తేలాల్సిన విషయం ఒక్కటే.. అదేంటంటే..

**హైదరాబాద్ పెన్ పవర్:** రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో ప్రధాన నిందితుడు తిరుమలరావును గద్వాల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గద్వాల పట్టణానికి చెందిన సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. ఐశ్వర్య ప్రియుడు తిరుమల?రావు తన భార్యను, ప్రియురాలి భర్త తేజేశ్వర్?ను గుట్టుచప్పుడు కాకుండా హత్య చేసి.. ఆత్మహత్యలుగా చిత్రీకరించి లడఖ్ వెళ్లేందుకు టికెట్లు సిద్ధం చేసుకున్నారు. ప్రియురాలు తన భర్తను అడ్డు తొలగించుకోగా, హత్య వ్యవహారం బయటకు రావడంతో కథ అడ్డం తిరిగింది. ఇద్దరిని హత్య చేశాక లడఖ్ వెళ్లేందుకు తిరుమల రావు బ్యాంక్? నుంచి రూ.25 లక్షల లోన్ తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో రూ.2 లక్షలు సుపారి గ్యాంగ్?కు చెల్లించినట్లు ఇన్వెస్టిగేషన్?లో తెలిసినట్లు ప్రచారం జరుగుతోంది. ఐశ్వర్య తల్లి సుజాత కర్నూలులోని ఒక బ్యాంకులో స్వీపర్?గా పని చేస్తుండగా బ్యాంక్ మేనేజర్ తిరుమల రావు ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమె కూతురు ఐశ్వర్యతో కూడా వివాహేతర సంబంధం పెట్టుకోవడం, ఆమెను పెళ్లి చేసుకుని పిల్లలను కనాలనుకోవడం ఈ కేసులో పెద్ద ట్విస్ట్.

తిరుమల రావుకు పెళ్లయి 8 ఏళ్లయినా పిల్లలు లేరు. అందుకే.. భార్యను చంపేసి ప్రియురాలితో కాపురం చేసి పిల్లలను కనాలని తిరుమల రావు భావించాడు. అయితే.. ఈ ఆలోచన కలిగే సమయానికి ఐశ్వర్యకు తేజేశ్వర్ అనే యువకుడితో పెళ్లయింది. వాస్తవానికి తేజేశ్వర్?ను పెళ్లి చేసుకోకుండా తిరుమలరావు, ఐశ్వర్య వెళ్లిపోయే అవకాశం ఉన్నా తేజేశ్వర్?ను పెళ్లి చేసుకుని మరీ చంపాల్సినంత అవసరం ఏమొచ్చిందనే విషయం ఇప్పుడు తేలాల్సి ఉంది. ఈ క్రమంలో మే 17న ఐశ్వర్య భర్త తేజేశ్వర్?ను పక్కా ప్లాన్?తో చంపేశారు. ఆ తర్వాత మేనేజర్ తన భార్యను కూడా చంపి ఇద్దరు కలిసి లడఖ్ వెళ్లేందుకు ఫ్లైట్? టికెట్లు కూడా సిద్ధం చేసుకున్నారు. అయితే మేనేజర్ భార్య హత్య నుంచి తప్పించుకున్నట్లు తెలుస్తోంది. తేజేశ్వర్ హత్య కేసులో పోలీసులు ఇంకా ఎంక్వైరీ కొనసాగిస్తున్నారు. పోలీసుల అదుపులో ఐశ్వర్య తల్లి సుజాత, ఐశ్వర్యతో పాటు సుపారి గ్యాంగ్, బ్యాంక్ మేనేజర్ తిరుమల రావు, కారు డ్రైవర్ ఉన్నారు.

# “యోగాంధ్ర” పై ప్రధాని మోదీ ప్రశంసల జల్లు.. దేశానికే ఆదర్శమన్న ప్రధాని

- కేంద్ర కేబినెట్ సమావేశంలో “యోగాంధ్ర” పై ప్రధాని మోదీ ప్రశంసలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ల కృషిని కొనియాడిన ప్రధాని
- ఇంత భారీ యోగా కార్యక్రమాన్ని ఎప్పుడూ చూడలేదని మోదీ వ్యాఖ్య
- యోగాంధ్ర నివేదికను ఇతర రాష్ట్రాలకు పంపుతామన్న కేంద్రం
- విశాఖ యోగా దినోత్సవంలో 3 లక్షల మందితో గిన్నిస్ రికార్డ్
- గిరిజన విద్యార్థుల సూర్య నమస్కారాలకూ మరో గిన్నిస్ రికార్డ్



హైదరాబాద్ పెన్ పవర్:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన “యోగాంధ్ర” కార్యక్రమంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ కార్యక్రమం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన ఆయన, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ల దార్శనికతను, అమలు తీరును కొనియాడారు. తాను చూసిన కార్యక్రమాల్లో ఇది అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదని, ప్రభావవంతమైనదని ఆయన పేర్కొన్నారు.“యోగాంధ్ర” వంటి భారీ కార్యక్రమాన్ని తాను ఇంతకు ముందెన్నడూ చూడలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన నెల రోజుల యోగా కార్యక్రమం ఒక అసాధారణ విజయమని ఆయన కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ల నాయకత్వంలో ఈ కార్యక్రమం విజయవంతమైందని, వారి కృషి అభినందనీయమని ప్రధాని పేర్కొన్నారు. “ఇప్పటివరకు ఎన్నో కార్యక్రమాలను చూశాను, కానీ ‘యోగాంధ్ర’ స్థాయిలో, స్ఫూర్తితో జరిగిన కార్యక్రమాన్ని చూడలేదు. దీనిని రూపొందించి, అమలు చేసిన తీరు నా అంచనాలను మించిపోయింది,” అని మోదీ తన కేబినెట్ సహచరులతో అన్నట్లు సమాచారం. వయసు, లింగ, వర్గ భేదాలు లేకుండా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను వరుసగా 30 రోజుల పాటు యోగా కార్యకలాపాల్లో ఏకం చేయగలిగిన రాష్ట్ర ప్రభుత్వ సామర్థ్యాన్ని ప్రధాని అభినందించారు. “ఇది కేవలం ఒక కార్యక్రమం కాదు, ఇదొక ఉద్యమం” అని మోదీ అభివర్ణించారు. విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున తాను పాల్గొన్న అనుభవం, గత 11 ఏళ్లుగా తాను హాజరైన అన్ని యోగా కార్యక్రమాల కంటే విభిన్నంగా, ఎంతో ఆనందాన్నిచ్చిందని ఆయన గుర్తుచేసుకున్నారు.

“యోగాంధ్ర” కార్యక్రమ ప్రణాళిక, ప్రజలను భాగస్వాములను చేసిన తీరు, అమలు చేసిన విధానాలపై సమగ్ర నివేదికను సమర్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరినట్లు ప్రధాని తెలిపారు. ఆ నివేదిక అందిన తర్వాత, దానిని అన్ని రాష్ట్రాలకు పంపిస్తామని, వారు కూడా దీనిని అధ్యయనం చేసి, ఉత్తమ పద్ధతులను అనుసరించవచ్చని సూచిస్తామని ఆయన వెల్లడించారు. ఒక మంచి కార్యక్రమాన్ని ఎలా విజయవంతం చేయాలో చంద్రబాబు, లోకేశ్ లను చూసి మిగతా వారు నేర్చుకోవాలని ప్రధాని సూచించారు. “యోగాంధ్ర” విజయాన్ని అందరూ అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రులకు తెలియజేశారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో 3,02,087 మంది ఒకేచోట యోగా చేసి గిన్నిస్ ప్రపంచ రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. కొందరు తెల్లవారుజామున 2 గంటలకే కార్యక్రమ స్థలికి చేరుకోవడం విశేషం. హాజరును కచ్చితంగా నమోదు చేయడానికి క్యూఆర్ కోడ్ ఆధారిత ట్రాకింగ్ వ్యవస్థను ఉపయోగించడం, ప్రభుత్వ కార్యక్రమ నిర్వహణలో ఒక నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. అలాగే, “యోగాంధ్ర” ప్రచారంలో భాగంగా 22,122 మంది గిరిజన విద్యార్థులు ఏకకాలంలో సూర్య నమస్కారాలు చేసి మరో గిన్నిస్ ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఈ రికార్డుల పట్ల కూడా ప్రధాని మోదీ సంతోషం వ్యక్తం చేశారు.

# మంచు విష్ణు కార్యాలయాల్లో జీఎస్టీ సోదాలు.. ఆసక్తికరంగా స్పందించిన మంచు హీరో!

- మంచు విష్ణు కార్యాలయాల్లో కేంద్ర జీఎస్టీ అధికారుల తనిఖీలు
- ‘కన్నప్ప’ సినిమా జీఎస్టీ చెల్లింపుల్లో తేడాలున్నాయని అనుమానం
- మాదాపూర్, కావూరి హిల్స్‌లోని ఆఫీసుల్లో రెండు బృందాల సోదాలు
- ఆఫీసుకు చేరుకున్న నటుడు మోహన్ బాబు
- దాపరికం ఏమీ లేదన్న విష్ణు, ఎక్కడెక్కడ అప్పులు చేశామో తెలుస్తాయని వ్యాఖ్య



హైదరాబాద్ పెన్ పవర్:ప్రముఖ సినీ నటుడు మంచు విష్ణుకు చెందిన కార్యాలయాల్లో బుధవారం కేంద్ర జీఎస్టీ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్‌లోని మాదాపూర్, కావూరి హిల్స్‌లో ఉన్న ఆయన కార్యాలయాలపై ఏకకాలంలో రెండు ప్రత్యేక బృందాలు ఈ సోదాలు నిర్వహించాయి. ‘కన్నప్ప’ సినిమాకు సంబంధించిన జీఎస్టీ చెల్లింపుల విషయంలో కొన్ని వ్యత్యాసాలు ఉన్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సంబంధిత ఆర్థిక రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ తనిఖీల విషయం తెలియగానే, మంచు విష్ణు తండ్రి, సీనియర్ నటుడు మోహన్ బాబు కూడా కార్యాలయానికి చేరుకున్నారు.

**విష్ణు ఏమన్నారంటే...?**

ఈ పరిణామాలపై మీడియా ప్రతినిధులు మంచు విష్ణును ప్రశ్నించగా, “మీరు చెప్పేంత వరకు నాకు ఈ విషయం తెలియదు. అయినా, ఇందులో దాచిపెట్టడానికి ఏమీ లేదు. ఎక్కడెక్కడ అప్పులు చేశామో ఈ తనిఖీల ద్వారా తెలుస్తుంది కదా” అని ఆయన వ్యాఖ్యానించారు. ఇదే సందర్భంగా ‘కన్నప్ప’ సినిమా గురించి కూడా విష్ణు ప్రస్తావించారు. “ఇటీవలే హిందీలో సినిమా ఫైనల్ కాపీ చూశాను. సినిమా చివరి సన్నివేశాలు చూసి అక్కడ కొందరు ప్రముఖుల రోమాలు నిక్కబొడుచుకున్నాయని చెప్పారు. ప్రేక్షకులు కూడా ఇదే విధమైన అనుభూతిని పొందుతారని ఆశిస్తున్నాను. ఇది దేవుడికి, భక్తుడికి మధ్య ఉండే ఒక పవిత్రమైన కథ. కన్నప్ప గొప్పతనాన్ని ఈ తరం వారికి తెలియజేయాలన్నదే మా ముఖ్య ఉద్దేశం” అని విష్ణు వివరించారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో మంచు విష్ణు తిన్నడు/కన్నప్ప పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్, మోహన్ లాల్, అక్షయ్ కుమార్, మోహన్ బాబు, కాజల్ అగర్వాల్ కీలక పాత్రలు పోషించారు.